# ‘హస్త’వ్యస్తం

మంచిర్యాల, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ‘హస్త’వ్యస్తంగా మారింది. అసమ్మతి సెగలతో పార్టీ అట్టుడికిపోతున్నది. రెండో జాబితా ప్రకటించడంతో ఉమ్మడి జిల్లాలో 9 స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. చెన్నూర్ నియోజకవర్గం మాత్రం పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించడం దాదాపు ఖాయమైనట్లు తెలుస్తున్నది. ఇదే జరిగితే ఆ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు సునాయసం కానుంది. మంచిర్యాల జిల్లాలో మిగిలిన రెండు మంచిర్యాల, బెల్లంపల్లిలో ఫస్ట్ లిస్ట్‌లోనే అభ్యర్థులను ప్రకటించారు. కానీ ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడిన నాయకులు పార్టీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మంచిర్యాలలో టికెట్ ఆశించి భంగపడిన ఆ పార్టీ జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్తె సత్తయ్య ఇప్పటికే బీఆర్ఎస్‌లో చేరారు. దీంతో లక్షెట్టిపేట మండలం మొత్తం బీఆర్ఎస్ బలం పెరిగింది. ఇక టికెట్ ఆశించిన మరో నేత కేవీ ప్రతాప్, బీసీలకు టికెట్ ఇస్తే కాంగ్రెస్ నుంచి తనకే ఇవ్వాలని కోరిన డాక్టర్ నీలకంఠేశ్వర్ గౌడ్ లాంటి కీలక నేతలు కాంగ్రెస్ అభ్యర్థి ప్రేమ్ సాగర్‌కు రావు కోసం జనంలో తిరగడం లేదు. ఇక మిగిలిన కిందిస్థాయి లీడర్లు కూడా గొడవకు దిగుతున్నారు. దీంతో మంచిర్యాలలో కాంగ్రెస్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇక బెల్లంపల్లి టికెట్ గడ్డం వినోద్‌కు ఇవ్వడంతో అక్కడ ప్రేమ్‌సాగర్‌రావు వర్గంగా ఉన్న నాతరి స్వామి వర్గం అలకపూనింది. ప్రస్తుతం పార్టీలో ఉన్న వారు కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించడమే లక్ష్యంగా పని చేస్తున్నారనే ప్రచారాలు జరుగుతున్నాయి. అదే జరిగితే ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి పడే కొన్ని ఓట్లు కూడా గల్లంతు అవ్వడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇక చెన్నూర్ నియోజకవర్గంలో దాదాపు 14 మంది నాయకులు కాంగ్రెస్ టికెట్ అడిగారు. వారిలో మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, డాక్టర్ రాజా రమేశ్, రామిండ్ల రాధిక లాంటి ముఖ్యమైన నాయకులు ఉన్నారు. ఇప్పుడు ఉన్నఫలంగా టికెట్ సీపీఐకి ఇస్తుండటంతో వీరెవరూ సహకరించే పరిస్థితులు లేవు. పైగా అంతా కలిసి కాంగ్రెస్ నుంచి ఓ రెబల్ అభ్యర్థిని బరిలోకి దించాలనే యోచనలో ఉన్నారు. ఇలా మంచిర్యాల జిల్లాలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్‌లలోని కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా మారిపోయింది.

### ఆసిఫాబాద్‌లో అదే దుస్థితి...

ఆసిఫిబాద్ టికెట్ శ్యామ్ నాయక్‌కు ఇవ్వడంతో మర్సకోల సరస్వతి వర్గం మండిపడుతున్నారు. పార్టీ కోసం ముందు నుంచి కష్టపడిన ఆమెను కాదని ఆయనకు టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నిస్తున్నారు. సరస్వతికే టికెట్ ఇవ్వాలంటూ ఇప్పటికే నియోజకవర్గంలో పలు చోట్ల భారీ ధర్నాలు చేశారు. హైదరాబాద్ గాంధీభవన్‌కు వెళ్లి మరీ శ్యామ్‌నాయక్‌కు టికెట్ ఇవ్వొద్దని ఆందోళన చేశారు. కానీ ఇవేవి పట్టించుకోకుండా పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకోవడం సరస్వతి వర్గానికి మింగుడు పడడం లేదు. దీంతో సరస్వతి వేరే పార్టీ నుంచి పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇదే నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి డాక్టర్ గణేశ్ రాథోడ్, ప్రేమ్‌సాగర్ రావు తమ్ముడు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌లు సైతం శ్యామ్‌నాయక్‌కు మద్దతుగా నిలిచే పరిస్థితి లేదు. ఇన్ని రోజులు టికెట్ తమకే వస్తుందని చెప్పుకుంటూ తిరిగి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని జనంలోకి వెళ్లాలని వారు వాపోయినట్లు తెలిసింది. సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ రావి శ్రీనివాస్‌కు ఇచ్చారు. కానీ ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ఏ మాత్రం ప్రభావం చూపే పరిస్థితి లేదు. బీఎస్పీ నుంచి పోటీ చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు మేలు చేసేందుకే అంతర్గతంగా కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను డమ్మీ అభ్యర్థికి ఇస్తారనే ముందు నుంచి ప్రచారం జరిగింది. దానికి అనుగుణంగానే ఇప్పుడు టికెట్‌ను రావి శ్రీనివాస్‌కు ఇచ్చారు. కోర్లళ్ల కృష్ణారెడ్డి, యూనిస్‌లలో ఎవరికి టికెట్ ఇచ్చినా కొంత వరకు బాగుండేదని చెబుతున్నారు.

### నిర్మల్‌లో నిర్వీర్యం..

నిర్మల్ జిల్లాలో ఖానాపూర్ నియోజకవర్గ టికెట్‌ను వెడమ బొజ్జుకు ఇచ్చారు. దీంతో టికెట్ కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరిన రేఖానాయక్ ఆగ్రహంగా ఉన్నారు. కాంగ్రెస్ కోసం ఆమె పని చేసే పరిస్థితి కనిపించడం లేదు. టికెట్ తనకే వస్తుందని ప్రెస్‌మీట్‌లు పెట్టి మరీ చెప్పిన ఆమె బొజ్జుకు టికెట్ ఇవ్వడంతో ఏం చేయాలో తెలియని అయోమయంలో పడిపోయారు. దీంతో ఈ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు విజయ అవకాశాలు మరింత మెరుగుపడ్డాయి. దాదాపు ఓ 15 మంది ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. వీరెవరూ ఇప్పుడు పార్టీకి పనిచేసేలా లేదు. ఇక ముథోల్ నియోజకవర్గం నుంచి కిరణ్ కామ్రేవార్ మొదటి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించారు. ప్రచారం కూడా చేసుకున్నారు. పార్టీ కోసం కష్టపడుతూ వచ్చారు. తీరా ఆయన్ని కాదని నిన్న, మొన్న పార్టీలో చేరిన నారాయణరావు పటేల్‌కు టికెట్ ఇచ్చారు. దీంతో కిరణ్ కామ్రేవార్ కాంగ్రెస్ అధిష్టానం మీద తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ఆయనగానీ, అనుచరులు గానీ కాంగ్రెస్ కోసం బయటకు వచ్చి పనిచేసే పరిస్థితి లేదు.

### ఆదిలాబాద్‌లో అధోగతి..

ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పరిస్థితి విచిత్రంగా తయారైంది. ఆదిలాబాద్‌లో కంది శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. దీంతో ముందు నుంచి పార్టీ కోసం పని చేసిన సాజిద్ ఖాన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్ర సుజాత, మాజీ మంత్రి రాంచందర్‌రెడ్డి అల్లుడు సంజీవ్‌రెడ్డి టికెట్ ఆశించారు. వీరి ముగ్గురిని కాదని ఆరు నెలల క్రితం పార్టీలోకి వచ్చిన శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. ఈయనకు టికెట్ ఇవ్వొద్దంటూ గాంధీ భవన్‌కు వెళ్లి మరీ సాజిద్ ఖాన్ వర్గం ధర్నా చేశారు. ఇప్పుడు శ్రీనివాస్‌రెడ్డినే ఖరారు చేయడంతో వీళ్లు ముగ్గురు ఇప్పుడు కాంగ్రెస్‌కు పని చేసే పరిస్థితి లేదు. బోథ్ నియోజకవర్గం నుంచి గతంలో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన నరేశ్ జాదవ్, ఆడె గజేందర్ టికెట్ ఆశించారు. టికెట్ ఇస్తారనే నమ్మకంతో ఈ మధ్యే కాంగ్రెస్‌లో చేరిన రాథోడ్ బాపురావ్‌కు సైతం మొండి చేయి చూపించారు. వెన్నెల అశోక్‌కు టికెట్ కేటాయించినప్పటికీ వీళ్లు ఎవరూ ఆయనకు సపోర్ట్ చేసే పరిస్థితి కనిపించడం లేదు.

# గనులు, ఓసీపీలపై ప్రచారాలు నిషేధం

శ్రీరాంపూర్, అక్టోబర్ 27 : గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓసీపీలపై రాజకీయ ప్రచారాలను నిషేధిస్తూ యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా డీవైజీఎం(పర్సనల్) అరవిందరావు తెలిపారు. రాజకీయ నాయకులు, ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారాలు చేయరాదని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించి సమావేశాలు నిర్వహించినా, సమావేశాలకు కార్మికులు, ఉద్యోగులు హాజరైనా క్రమ శిక్షణా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఉద్యోగులందరూ గమనించి సమావేశాలకు హాజరుకావద్దని సూచించారు. రాజకీయ ప్రచారాలు చేస్తే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

# అవగాహనతోనే ప్రమాదాలు తగ్గినయ్

- సేఫ్టీపై కార్మికులకు మరింత వివరించాలి
- సేఫ్టీ కమిటీ కన్వీనర్ల సూచన
- సింగరేణి వ్యాప్తంగా కొనసాగుతున్న రక్షణ వారోత్సవాలు



శ్రీరాంపూర్ : ఆర్కే-7 గనిపై సేఫ్టీ తనిఖీ అధికారుల బృందంతో ఉద్యోగులు

శ్రీరాంపూర్, అక్టోబర్ 27 : సింగరేణి యాజమాన్యం చేపట్టిన ఎస్‌వోపీ, ఎస్ఎంపీపై అవగాహన పెరగడం వల్లే కార్మికులు వ్యక్తిగత రక్షణ సూత్రాలు పాటిస్తున్నారని, తద్వార 2023లో ప్రమాదాలు తగ్గాయని సేఫ్టీ కమిటీ కన్వీనర్ లలిత్‌కుమార్ స్పష్టం చేశారు. 54వ రక్షణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరాంపూర్ ఆర్కే-7 గనిని కార్పొరేట్ సేఫ్టీ కమిటీ అధికారుల బృందం తనిఖీ చేసింది. జీఎం సంజీవరెడ్డి ఆధ్వర్యంలో సేఫ్టీ కమిటీ కన్వీనర్ డీ లలిత్‌కుమార్, సభ్యులు బీ ఏజీఎం శ్రీనివాస్, ఎస్ఈ రామకృష్ణ, డీవైజీఎం సదానందం, జూనియర్ సర్వేయర్ అబ్దుల్ నబీ, అదనపు మేనేజర్ అమర్‌నాథ్‌రెడ్డి, ఎస్‌వోఎం కృష్ణప్రసాద్, వర్క్‌మన్ ఇన్‌స్పెక్టర్ యాస శ్రీనివాస్, బీ సురేశ్ సందర్శించారు. గనిపై కార్మికులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గనిపై డిపార్ట్‌మెంట్లను పరిశీలించి, గనిలోని పనిస్థలాలను తనిఖీ చేశారు. రక్షణ చర్యల అమలుపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సేఫ్టీ కమిటీ కన్వీనర్ మాట్లాడుతూ.. కార్మికులు తప్పని సరిగా రక్షణ సూత్రాలు పాటిస్తూ, రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని కోరారు. కార్మికులు దేశ బార్డర్‌లోని సైనికుల్లా ఎప్పటికప్పుడు అప్రమత్తతతో పనిచేస్తున్నారని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కే హరినారాయణ గుప్తా, గని ఏజెంట్ రాముడు, మేనేజర్ సాయిప్రసాద్, ఈఈ రాజారవి చరణ్, గని సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్, ఈఈ ప్రవీణ్, వెంటిలేషన్ ఆఫీసర్ జగదీశ్వర్‌రావు, సీనియర్ పీవో సంతన్, గని సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### రక్షణతో సంస్థ అభివృద్ధికి పాటుపడాలి..

రామకృష్ణాపూర్, అక్టోబర్ 27 : రక్షణతో పని చేస్తూ సింగరేణి సంస్థ అభివృద్ధికి పాటు పడాలని సేఫ్టీ టీమ్ కన్వీనర్ సూర్యనారాయణ రాజు అన్నారు. రక్షణ పక్షోత్సవాల సందర్భంగా ఆర్కేపీ సీహెచ్‌పీని సందర్శించిన కమిటీ కన్వీనర్, సభ్యులు నరేంద్ర కుమార్, శ్రీనివాస్ ఎన్విరాన్‌మెంట్ సభ్యుడు ఆంజనేయ ప్రసాద్, ఏరియా రక్షణ జీఎం నాగరాజు, ఆర్కేపీ సీహెచ్‌పీ డీజీఎం బాలాజీ భగవతి, ఎస్ఈ చంద్రమౌళి, డీవైఎస్ఈ అశోక్‌రెడ్డి, సేఫ్టీ కమిటీ సభ్యులు వారిని సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ.. ప్రతీ కార్మికుడు ఇంటి నుంచి బయల్దేరే ముందే రక్షణ పాటించాలని సూచించారు. ఆర్కేపీ సీహెచ్‌పీని తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రక్షణ సూత్రాలు పాటించిన కార్మికులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ కమిటీ సభ్కులు శంకర్‌రావు, హరి రామకృష్ణ, వేణుగోపాల్, కోలమోహన్, కృష్ణస్వామి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

### కాసిపేట గనిపై..

కాసిపేట, అక్టోబర్ 27 : మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిపై రక్షణ పక్షోత్సవాలను ఘనంగా ప్రారంభించారు. జాతీయ జెండా, రక్షణ జెండాతో బైక్ ర్యాలీ తీశారు. అనంతరం శాంతికి గుర్తుగా శాంతి కపోతాలను ఎగురవేశారు. ముందుగా గనిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. ప్రమాదరహితంగా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం అత్యవసర పరిస్థితుల్లో నిర్వహించే సీపీఆర్ పద్ధతిపై రెస్క్యూ సిబ్బంది సింగరేణి ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏజెంట్ రాందాస్, మేనేజర్ అల్లావుద్దీన్, ఏరియా రక్షణాధికారి రవీందర్, గని రక్షణాధికారి సునీల్, ఏరియా ఇంజినీర్ రాం ప్రసాద్, తనిఖీ బృందం సభ్యులు ప్రవీణ్, విక్రం, సాయినాథ్, శ్రీనివాస్, సంక్షేమాధికారి మీర్జా గౌస్ జీషా, బన్న లక్ష్మణ్‌దాస్ పాల్గొన్నారు.


కాసిపేట గనిపై బహుమతులు అందిస్తున్న అధికారులు



రామకృష్ణాపూర్ : ఆర్కేపీ సీహెచ్‌పీని సందర్శిస్తున్న కమిటీ సభ్యులు

# కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలి

- నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్
- 5వ వార్డు, ఆర్కే-6 గుడిసెల్లో బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకుల ప్రచారం


5వ వార్డు ఆర్కే 6 గుడిసెల్లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్, అక్టోబర్ 27 : ప్రజా, రైతు పక్షపాతి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపెల్లి ప్రభాకర్ ప్రజలను కోరారు. నస్పూర్ మున్సిపాలిటీ పరిధి 5వ వార్డు ఆర్కే-6 గుడిసెల్లో శుక్రవారం నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్ భౌతు లక్ష్మితో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటు పడుతున్నారన్నారు. విద్య, వైద్య, వ్యవసాయం అభివృద్ధికి కృషిచేస్తున్నారని చెప్పారు. తెలంగాణ వచ్చాక ఐటీ రంగంలో 3 లక్షల ఉద్యోగాలు లభించాయని చెప్పారు. మంచిర్యాల ఎమ్మెల్యేగా నడిపెల్లి దివాకర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి మేరుగు పవన్, ఉపాధ్యక్షుడు నౌండ్ల సంతోష్‌చారి, టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, ఏరియా చర్చల ప్రతినిధులు కాశీరావు, కుమారస్వామి, మాజీ జడ్పీటీసీ తిప్పని రామయ్య, కౌన్సిలర్లు లక్ష్మి, నాసర్, పూదరి కుమార్, విజయ్‌కుమార్, రాజేశం, మాజీ సర్పంచ్‌లు జక్కుల రాజేశం, గుంట జగ్గయ్య, మాజీ ఎంపీటీసీలు రాయలింగు, శ్రీనివాస్, వా ర్డుల అధ్యక్షులు రఫీక్‌ఖాన్, రమణ, సాగర్, రవిగౌడ్, ఎల్లయ్య, దగ్గుల మధు, నాయకులు ప్రశాం త్, రాజు, ప్రవీణ్, సోహెల్‌ఖాన్, సత్తయ్య, బోనాసి స్వామి, గర్సె భీమయ్య, బానేశ్ పాల్గొన్నారు.

# రూ.2 లక్షల పట్టివేత

బెల్లంపల్లి రూరల్, అక్టోబర్ 27 : పట్టణంలోని కాంటా ఏరియాలో శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, బెల్లంపల్లి స్టేషన్‌రోడ్ కాలనీకి చెందిన ఎండీ రాజ్‌మహ్మద్ వద్ద రూ.2 లక్షలు పట్టుకున్నట్లు వన్‌టౌన్ సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సంబంధిత నగదును ఎఫ్ఎస్‌టీ టీం సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఆధారాలు లేకుండా పెద్ద మొత్తంలో నగదు కలిగి ఉన్నా, రవాణా చేసినా సీజ్ చేస్తామని సీఐ వెల్లడించారు.